ఇక కోతే..!

బోగస్ పింఛన్ల ఏరివేతకు శ్రీకారం
సర్టిఫికెట్ల పరిశీలనకు ఆదేశం
పక్క జిల్లాల డాక్టర్లకు బాధ్యతలు
ఆందోళనలో బోగస్ పింఛన్‌దారులు, వైద్యులు

అనంతపురం టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నకిలీ వైకల్య సర్టిఫికెట్లతో పింఛన్ పొందుతున్న వారి ఏరివేతకు ప్రభుత్వం సిద్ధమైంది. గత వైసీపీ పాలనలో అక్రమపద్ధతిలో నకిలీ వైకల్య సర్టిఫికెట్లు జారీ చేయించారనే విమర్శలు ఉన్నాయి. ఆసమయంలో కొందరు డాక్టర్లు దళారీలను ఏర్పాటు చేసుకొని డబ్బులు దండుకొని వైకల్య సర్టిఫికెట్లు ఇచ్చారనే ఆరోపణలు అధికంగానే ఉన్నాయి. ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు ఓ జిల్లాలో జరిగిన సమావేశంలోనే నకిలీ వైకల్య సర్టిఫికెట్లు అధికంగా ఉన్నాయని, బోగస్‌లను ఏరివేసి అసలైన అర్హులకు మాత్రమే పింఛన్లు అందేలా చూడాలని ఆదేశించారు. ఈనేపథ్యంలో రాష్ట్ర వైద్యశాఖ డైరెక్టరు(డీఎంఈ) సిరి నాలుగు రోజుల కిందట నకిలీ వైకల్య ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతున్నవారిని గుర్తించేందుకు మూడు నెలల పాటు ప్రత్యేక పరిశీలన చేపట్టనున్నట్లు ప్రటించారు. దీంతో నకిలీ సర్టిఫికెట్లతో ఫింఛన్లు తీసుకుంటున్న వారితో పాటు, ఆ సర్టిఫికెట్లు జారీ చేసిన డాక్టర్లలో ఆందోళన మొదలైంది.



పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టరు వినోద్ కుమార్ (ఫైల్)

పింఛన్ల సంగతి ఇలా...

జిల్లాలో అన్నికేటగిరీలకు సంబంధించి 284085 పింఛన్లు ఉన్నాయి. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈపింఛన్ల సొమ్మును అమాంతం పెంచారు. మంచానికే పరిమితమైన బాధితులకు నెలకు రూ15వేలు ఇస్తున్నారు. జిల్లాలో అధికారిక లెక్కల మేరకు మంచానికే పరిమితమైనట్లు మెడికల్ పత్రాలు పొందినవారు 1425మంది ఉన్నారు. వీరికి ప్రతినెలా రూ15వేలు చొప్పన రూ.2.13కోట్లు అందిస్తున్నారు. దివ్యాంగుల సర్టిఫికెట్లుతో జిల్లాలో 45820మంది పింఛన్లు తీసుకుంటున్నారు. వీరికి ప్రతినెలా రూ.ఆరువేలు చొప్పన రూ.27.63కోట్లు అందజేస్తున్నారు. అలాగే గుండెమార్పిడి, కిడ్నీ మార్పిడి, లివర్‌మార్పిడి, డయాలసిస్ చేయించుకుంటున్న బాధితులకు నెలకు రూ.10వేలు పింఛన్ ఇస్తున్నారు. ఇలాంటివారు జిల్లాలో 1047మంది ఉన్నారు.

తొలుత మంచానికి పరిమితమైన వారి ఇంటికి వెళ్లి పరిశీలన

ప్రభుత్వ నిర్ణయం మేరకు బోగస్ వైకల్య సర్టిఫికెట్ల పరిశీలనకు అధికారయంత్రాంగం సిద్ధమైంది. తొలుత మంచానికే పరిమితమైనట్లు వైకల్య సర్టిఫికెట్లతో రూ.15వేలు పింఛన్ తీసుకుంటున్న వారిని పరిశీలించనున్నారు. జిల్లాలో ఇలాంటివారు 1425మంది ఉన్నారు. వీరి వివరాలు తీసుకొని నేరుగా ఇళ్లవద్దకే వెళ్లి వారి పరిస్థితి, డాక్టర్లు జారీచేసిన వైకల్య సర్టిఫికెట్లు పరిశీలించనున్నారు. జనవరి నెలలో మంచానికి పరిమితమైనవారి సర్టిఫికెట్లు, ఫిబ్రవరి, మార్చినెలలో దివ్యాంగుల వైకల్య మెడికల్ సర్టిఫికెట్లను పరిశీలించనున్నారని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ఈనెల 3న ఈ పరిశీలనపై మార్గదర్శకాలు రానున్నట్లు చెబుతున్నారు. ఈ ప్రక్రియ ముగిసేవరకు కొత్తగా వైకల్య సర్టిఫికెట్లకు బుక్‌చేసుకోవడానికి అవకాశం లేకుండా సదరం స్లాట్స్ బంద్ చేశారు.

పక్క జిల్లాల డాక్టర్లతో పరిశీలన

నకిలీ వైకల్య సర్టిఫికెట్ల వ్యవహారంపైనా సర్కారు చాలా పకడ్బందీగా వెళుతున్నట్లు కనిపిస్తోంది. ఈ సర్టిఫికెట్లను సొంత జిల్లా డాక్టర్లు జారీ చేసి ఉంటారు. కాబట్టి వారితో పరిశీలన చేస్తే పెద్దగా ఫలితం ఉండదని, ఈ కార్యక్రమానికి ఇతర జిల్లాల డాక్టర్లను నియమించాలని రాష్ట్ర వైద్యశాఖ అధికారులు నిర్ణయించారు. ఈడాక్టర్ల బృందానికి పింఛన్‌దారులను చూపడానికి రెవెన్యూ, గ్రామ సచివాలయాలు, డీసీహెచ్ఎస్, డీఎంహెచ్‌ఓ శాఖలకు బాధ్యతలు అప్పగించారు. మంచానికే పరిమితమైనట్లు నిబంధనల ప్రకారం సర్టిఫికెట్ ఇచ్చారా అని డాక్టర్ల బృందం పరిశీలించనుంది. అలాగే దివ్యాంగుల సర్టిఫికెట్లు సదరంలో ఇష్టారాజ్యంగా ఇచ్చారనే ప్రచారం ముందునుంచి ఉంది. వాటిని పక్కజిల్లాల డాక్టర్లు పరిశీలించనున్నారు. దీంతో నకిలీ వైకల్య ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులలోను, ఆ సర్టిఫికెట్లు జారీ చేసిన జిల్లా డాక్టర్లలోను ఆందోళన మొదలైంది. ప్రధానంగా ఎముకల డాక్టర్లు ఈనకిలీ వైకల్య సర్టిఫికెట్లు ఎక్కువగా జరీ చేసి, అక్రమాలకు పాల్పడ్డారనే ప్రచారం కొనసాగుతుంది.

పరిశీలన నిజమే: డాక్టరు రవికుమార్, డీసీహెచ్ఎస్

నకిలీ వైకల్య మెడికల్ సర్టిఫికెట్లతో పింఛన్లు పొందుతున్నారనే దానిపై ఆరోపణలు ఉన్నాయి. దీన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని వాటిని పరిశీలించాలని నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే డీఎంఈ నుంచి ఆదేశాలు వచ్చాయి, పక్క జిల్లాల డాక్టర్లు వచ్చి ఇక్కడ పరిశీలిస్తారు. దీనిపై ఈనెల 3న పూర్తిగా గైడ్‌లెన్స్ రానున్నాయి.

అర్ధరాత్రి 12 దాకా మద్యం షాపులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): న్యూ ఇయర్‌ను పురస్కరించుకొని మద్యం షాపుల నిర్వహణ సమయాన్ని పెంచారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. న్యూ ఇయర్ నేపథ్యంలో మద్యం షాపులను మంగళవారం అర్ధరాత్రి 12 గంటల దాకా, బార్ అండ్ రెస్టారెంట్లను ఒంటి గంటదాకా ఓపెన్ చేసి, మద్యం విక్రయించేందుకు అనుమతులు ఇచ్చారు. దీంతో మద్యంప్రియులు అర్ధరాత్రి దాకా మందు పార్టీలు చేసుకొని, జల్సా చేశారు.

పోలీసు అధికారులకు సత్కారం



పోలీసు అధికారులను సన్మానిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు


అనంతపురం రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్‌లో రాగి, అల్యూమినియం వైర్ల చోరీ కేసులను ఛేదించిన పోలీసులను విద్యుత్ శాఖ జిల్లా అధికారులు సత్కరించారు. మొత్తం 33 చోరీ కేసులలో జిల్లా పోలీసులు 970 కిలోల రాగి, అల్యూమినియం వైర్లను రికవరీ చేశారు. దీంతో పోలీసు అధికారులను జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ జేవీ రమేష్, విజిలెన్స్ అధికారి విశ్వనాథచౌదరి తదితరులు మంగళవారం సత్కరించారు. కేసులను ఛేదించి రైతులకు, విద్యుత్ సంస్థకు మేలు చేసినందుకు ఎస్ఈ సంపత్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏఓ బాలాజీ వెంకటేష్, డీఈఈలు, రామకృష్ణ, శ్రీనివాసులు, చంద్రశేఖర్, ఏఓ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

కరువు బృందం పర్యటన వాయిదా

అనంతపురం అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో జరిగిన పంట నష్టంపై అధ్యయనం కోసం జిల్లాకు రావాల్సిన కేంద్ర కరువు బృందం పర్యటన వాయిదా పడింది. ఇదివరకు జనవరి 2, 3 తేదీల్లో కరువు బృందం జిల్లాలోని కరువు మండలాల్లో పర్యటించనున్నట్లు షెడ్యూల్ ఖరారైంది. ఆ మేరకు వ్యవసాయ, అనుబంధం శాఖల అధికారులు పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. అయితే కరువు బృందం పర్యటన రద్దు అయినట్లు మంగళవారం అధికారులకు సమాచారం అందింది. తదుపరి ఎప్పుడు పర్యటనకు వచ్చేది త్వరలోనే ప్రకటించే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సొంతూళ్ళకు వెళ్లే ప్రయాణికుల కోసం ఈనెల 9వ తేదీ నుంచి వివిధ రూట్లకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు 136 బస్సులు, పండుగ తర్వాత తిరుగు ప్రయాణానికి 14 నుంచి 19వ తేదీ వరకు 130 బస్సులు నడుపుతామని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయడం లేదని అన్నారు. ప్రయాణికులు ఆన్‌లైన్‌లో సైతం ముందస్తు రిజర్వేషన్లు పొందవచ్చునని తెలిపారు. రాను, పోను ఒకేసారి బుక్ చేసుకున్నవారికి టికెట్ ధరలో 10శాతం రాయితీ ఇస్తామని తెలిపారు.



నేడు విధుల్లోకి కలెక్టర్

అనంతపురం టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ బుధవారం విధుల్లో చేరనున్నారు. డిసెంబరు 17 నుంచి ఆయన సెలవులో ఉన్నారు. పదిహేను రోజుల సెలవు అనంతరం ఆయన తిరిగి విధుల్లోకి వస్తున్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి కారణంగా సంతాప దినాలు ఉండటంతో నూతన సంవత్సర వేడుకలకు కలెక్టర్ దూరంగా ఉంటారని డీఆర్వో మలోల తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం న్యూ ఇయర్ వేడుకలు ఉంటాయని, ఆ రోజు అధికారులు, ఇతర వర్గాలవారు హాజరుకావచ్చని తెలిపారు.

కాలేజీలో ఘుమ ఘుమలు

మూడో తేదీ నుంచి మధ్యాహ్న భోజనం

పేద విద్యార్థులకు ఆకలి బాధలు ఉండవు

జిల్లాలోని 23 కాలేజీల్లో 11,100 మందికి..

కూటమి ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం



కొత్తగా వచ్చిన వంట సామగ్రి, పాత్రలు



ఇళ్ల నుంచి లంచ్‌బాక్సులు తెచ్చుకుని తింటున్న విద్యార్థులు

అనంతపురం విద్య, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు కూటమి ప్రభుత్వం నూతన సంవత్సర కానుకను ప్రకటించింది. కాలేజీలో కడుపారా భోజనం చేసి చదువుకునే సౌకర్యాన్ని కల్పిస్తోంది. ఇన్నాళ్లూ ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తినేవారే. అలా వీలు కాకుంటే డబ్బులు వెచ్చించి బయట తినేవారు. ఆ రెండూ సాధ్యం కానివారు పస్తులు ఉండి చదువుకునేవారు. ఇకపై అలా ఏ ఒక్కరూ ఆకలితో బాధపడాల్సిన పనిలేదని ప్రభుత్వం ప్రకటించింది. 'మీరు కాలేజీకి వెళ్లి చక్కగా చదువుకోండి.. మీకు కడుపారా భోజనం పెట్టే బాధ్యత మాది.' అని కూటమి నేతలు శుభవార్త చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ఈ నెల మూడో తేదీ నుంచి ఎండీఎం అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 23 జూనియర్ కళాశాలల్లో 11,100 మంది విద్యార్థులకు భోజనం పెట్టనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఐదేళ్ల తర్వాత..

2019 ఎన్నికల ముందు ఇంటర్ విద్యార్థులకు అప్పటి ప్రభుత్వం ఎండీఎం ద్వారా భోజనాన్ని అందించింది. ఆ తర్వాత వచ్చిన జగన్ సర్కారు పథకాన్ని రద్దు చేసింది. దీంతో ఐదేళ్లుగా ఇంటర్ విద్యార్థులు ఆకలితో బాధపడ్డారు. పథకాన్ని కొనసాగించాలని విద్యార్థులు రోడ్డెక్కారు. అయినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం ఇంటర్ విద్యార్థుల ఆకలి తీర్చాలని నిర్ణయించింది. కాలేజీలకు సమీపంలో ఉన్న పాఠశాలలలో మధ్యాహ్న భోజనం వండి, ఇంటర్ విద్యార్థులకు అందిస్తారు. దగ్గరల్లో ఉన్న పాఠశాలలను కాలేజీలకు ట్యాగ్ చేశారు.

అదనంగా సిబ్బంది.. సామగ్రి

మధ్యాహ్న భోజనాన్ని ఇప్పటి వరకూ పాఠశాలలకే పరిమితం చేశారు. జిల్లాలో 1690 పాఠశాలల్లో ఎండీఎం అమలవుతోంది. వీటి పరిధిలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ 1,83,367 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 1561 పాఠశాలలకు ఎండీఎం ఏజెన్సీలు, 129 పాఠశాలలకు ఇస్కాన్, అక్షయపాత్ర, శైలజమ్మ సేవాట్రస్టు ద్వారా భోజనం అందుతోంది. ఇస్కాన్ ద్వారా అనంతపురం మండలంలోని 49 పాఠశాలలు, బుక్కరాయసముద్రం మండలంలో 24 పాఠశాలలు, తాడిపత్రిలో శైలజమ్మ సేవా ట్రస్టు ద్వారా 32 పాఠశాలలు, అక్షయపాత్ర ద్వారా డి.హీరేహాళ్ మండలంలో 13, కళ్యాణదుర్గంలో 11 పాఠశాలలకు భోజనం అందిస్తున్నారు. ఇవిగాక కొత్తగా జూనియర్ కళాశాలల్లో 11,100 మంది విద్యార్థులకు ఇకపై భోజనం అందిస్తారు. తద్వారా అదనపు భారం పడుతుంది. వంట సామగ్రి, వంట మనిషి, సహాయకులను అదనంగా సమకూరుస్తున్నారు. మొత్తం 23 కాలేజీలలో స్పెషల్ ఫీజు నిధుల నుంచి వంట పాత్రలు, ప్లేట్లు, గ్లాసులు, ఇతర సామగ్రిని కొంటారు. వంట మనుషులు, సహాయకులుగా 90 మందిని నియమించారు. వీరికి నెలకు రూ.3000 గౌరవవేతనం ఇస్తారు. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రోజుకు రూ.8.57 ఖర్చు చేస్తుంది.

జూనియర్ కళాశాల	విద్యార్థులు సంఖ్య	ట్యాగ్ చేసిన స్కూల్
1. కంబదూరు	108	కంబదూరు జడ్పీహెచ్‌ఎస్
2. నార్పల	226	నార్పల బాయ్స్ హైస్కూల్
3. అనంతపురం న్యూటౌన్ బాయ్స్	864	న్యూటౌన్ బాయ్స్ హైస్కూల్
4. అనంతపురం ఒకేషనల్	687	న్యూటౌన్ బాయ్స్ హైస్కూల్
5. అనంతపురం కేఎస్‌ఆర్	1704	కేఎస్‌ఆర్ ప్రభుత్వ హైస్కూల్
6. అనంతపురం ఓల్డ్ టౌన్	120	పాతూరు ప్రభుత్వ హైస్కూల్
7. ఆత్మకూరు	204	ఆత్మకూరు జడ్పీహెచ్‌ఎస్
8. కళ్యాణదుర్గం	1093	కరణం చిక్కప్ప స్కూల్
9. కుందుర్పి	286	కుందుర్పి హైస్కూల్
10.రాయదుర్గం	1161	10వ వార్డు స్కూల్
11.రాయదుర్గం గర్ల్స్ కాలేజ్	574	గర్ల్స్ హైస్కూల్
12. కణేకల్లు	526	రాంనగర్ బాయ్స్ స్కూల్
13. బెళుగుప్ప	72	బెళుగుప్ప జడ్పీహెచ్‌ఎస్
14. ఉరవకొండ బాయ్స్	642	9వ వార్డు హైస్కూల్
15. ఉరవకొండ గర్ల్స్	358	9వ వార్డు హైస్కూల్
16.పామిడి	375	పామిడి జడ్పీహెచ్‌ఎస్
17.శింగనమల	90	శింగనమల జడ్పీహెచ్‌ఎస్
18.పెద్దపప్పూరు	81	పెద్దపప్పూరు జడ్పీహెచ్‌ఎస్
19.తాడిపత్రి	409	15వ వార్డు స్కూల్
20.గుత్తి గర్ల్స్ కాలేజీ	348	గుత్తి గర్ల్స్ హైస్కూల్
21.గుంతకల్లు	547	27వ వార్డు స్కూల్
22.బొమ్మనహాళ్	498	బొమ్మనహాళ్ జడ్పీహెచ్‌ఎస్
23. డి.హీరేహాళ్	127	డి.హీరేహాళ్ జడ్పీహెచ్‌ఎస్



అమ్మకు ఇబ్బంది ఉండదు..

మాది కనగానపల్లి. అక్కడి నుంచి నిత్యం బస్సులో అనంతపురంలోని కేఎస్‌ఆర్ కాలేజీకి వస్తున్నాను. మా అమ్మ తెల్లవారు జామున లేచి వంట చేస్తే కాలేజీకి క్యారియర్ తెచ్చుకుంటాను. ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పెడితే మా అమ్మకు కష్టాలు తప్పుతాయి. ఇది మంచి పథకం. మా కడుపు నింపే కార్యక్రమం. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- ప్రీతి, ఎంఎల్‌టీ విద్యార్థిని, కనగానపల్లి

ఆకలి బాధలు తప్పుతాయి..

నేను ఇంటర్ ఎంఎల్‌టీ కోర్సు చేస్తున్నాను. నాది అనంతపురమే. అయినా మధ్యాహ్నం భోజనం కోసం ఇంటి నుంచి క్యారియర్ తెచ్చుకుంటాను. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే చాలా మంది విద్యార్థులు లంచ్ బాక్సులు తెచ్చుకోరు. వారికి ఆకలి బాధలు తప్పవు. ప్రభుత్వం ఇకపై మధ్యాహ్న భోజనం పెడితే ఆ సమస్య తీరుతుంది.

- నందిని, ఇంటర్ విద్యార్థిని, అనంతపురం



సంక్షేమం.. అభివృద్ధికి ప్రాధాన్యం

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్



పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి

అనంతపురం క్లాక్‌టవర్/ఉరవకొండ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. వజ్రకరూరు మండలం రూపానాయక్ తండాలో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి స్వయంగా పింఛన్ సొమ్మును అందజేశారు. గ్రామంలో పర్యటించి, సమస్యలను తెలుసుకున్నారు. రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుండటంతో ఉపాధి పథకం కింద కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు ఆదేశించారు. తండావాసులు మంత్రికి గిరిజన సంప్రదాయ తలపాగా, డాల్, తల్వార్, ఖడ్గాన్ని బహూకరించి, నగరా మోగించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి ఆదిశేషునాయుడు, తహసీల్దారు నజీర్ అహ్మద్, ఎంపీడీవో రవిప్రసాద్, ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి టీడీపీ మండల కన్వీనర్ నూతేటి వెంకటేషులు, సర్పంచ్ కొర్రా శివాజీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతమ్ పాల్గొన్నారు.

తాడిపత్రి టాప్

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఈ నెల తాడిపత్రి మున్సిపాలిటీ జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. జనవరి నెలకు జిల్లాలో 2,81,027 మంది లబ్ధిదారులకు రూ.124.03 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్క రోజు ముందుగానే మంగళవారం పంపిణీ చేపట్టారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశారు. ఒక్కరోజులోనే 2,71,798 మందికి రూ.119.74 కోట్లు ఇచ్చారు. 96.97 శాతం పంపిణీతో రాష్ట్రంలో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. తాడిపత్రి మున్సిపాలిటీలో 98.60 పంపిణీ చేసి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. పామిడి, నార్పల ఆ తరువాతి స్థానాల్లో నిలిచాయి. డి.హీరేహాళ్, కుందుర్పి, రాయదుర్గం మండలాలు చివరి మూడు స్థానాల్లో నిలిచాయి. కలెక్టరేట్ ఎన్‌ఐసీ నుంచి ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణశర్మ, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య పర్యవేక్షించారు.

వైసీపీకి బిగ్‌షాక్

9

టీడీపీలోకి ముగ్గురు జడ్పీటీసీలు, ఎంపీపీ

ఆహ్వానించిన మంత్రి పయ్యావుల కేశవ్

7 వరకూ అభ్యంతరాల స్వీకరణ

అనంతపురం టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కుల గణన అభ్యంతరాలను ఈ నెల 7వ తేదీ వరకు స్వీకరిస్తామని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణశర్మ మంగళవారం తెలిపారు. డిసెంబరు 31కి గడువు ముగిసిందని, దీంతో మరో వారం పొడిగించామని తెలిపారు. 7వ తేదీ తరువాత అభ్యంతరాలను పరిశీలిస్తామని తెలిపారు.

శేషాద్రి కుటుంబానికి న్యాయం చేయాలి

న్యాయవాదుల డిమాండ్



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అనంతపురం క్రైం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌లో మృతి చెందిన న్యాయవాది శేషాద్రి కుటుంబానికి న్యాయం చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. నగరంలో రెండో రోజు నిరసనలు కొనసాగించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విధులను బహిష్కరించారు. అనంతరం కోర్టు ఎదుట రహదారిపై ధర్నా నిర్వహించారు. సివిల్ తగాదాల విషయంలో జోక్యం చేసుకోరాదని పలు సందర్భాల్లో సుప్రీం కోర్టు, హైకోర్టులు పోలీసులకు సూచించాయని అన్నారు. అయినా త్రీటౌన్ పోలీసులు న్యాయవాదిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శేషాద్రి మృతికి పోలీసులే బాధ్యత వహించాలని అన్నారు. వేధించినవారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శేషాద్రి కుటుంబానికి న్యాయం చేసేవరకు పోరాటం ఆగదని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామలింగారెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరాముడు, అవ్వ సురేష్, భరత్ భూషణ్‌రెడ్డి, రామకృష్ణ, రాజారెడ్డి, సురేంద్రనాథ్, పద్మజ, శ్రీకాంత్, రాఘవేంద్ర, బాబా ఫక్ద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు

దేహదారుఢ్య పరీక్షలు

అనంతపురం క్రైం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో కానిస్టేబుల్ అభ్యర్థులకు రెండో రోజు మంగళవారం దేహదారుఢ్య పరీక్షలు కొనసాగించారు. ఎస్పీ జగదీష్ పర్యవేక్షణలో పారదర్శకంగా పీఎంటీ, పీఈటీ పరీక్షలు నిర్వహించారు. సీసీ కెమెరాలతో ఈ ప్రక్రియపై నిఘా వేశారు. అభ్యర్థులు తెల్లవారు జామునే స్టేడియం వద్దకు వచ్చారు. వారి సర్టిఫికెట్స్‌ను పరిశీలించిన అనంతరం బయోమెట్రిక్ తీసుకున్నారు. ఆ తరువాత ఫిజికల్ మెజర్‌మెంట్స్ తీసుకున్నారు. అనంతరం 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు. సమస్యలపై అప్పీల్ చేసుకునేవారు లిఖిత పూర్వకంగా తెలియజేసి, ఈ నెల 17న రావాలని సూచించారు. ఏఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్‌బాషా, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు.



పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ జగదీష్

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ.7

అనంతపురం రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 7తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 1200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.5, కనిష్ఠ ధర రూ.4 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ. 27వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 27,420 పలికినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 16వేలుతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 11 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రిజర్వాయర్‌కు 777 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 777 క్యూసెక్కులు ఉన్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 175 క్యూసెక్కులు వెళుతుందని వివరించారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీలు నీరు వున్నట్లు పేర్కొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లను తీసుకెళ్లండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని పెన్షనర్ల కార్యాలయంలో బుధవారం నుంచి లైఫ్ సర్టిఫికెట్లను ఇస్తామని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన గౌడ్ తెలిపారు. పెన్షనర్లు సర్టిఫికెట్లను తీసుకుని ఎస్టీఓ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

7 వరకూ అభ్యంతరాల స్వీకరణ

అనంతపురం టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కుల గణన అభ్యంతరాలను ఈ నెల 7వ తేదీవరకు స్వీకరిస్తామని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణశర్మ మంగళవారం తెలిపారు. డిసెంబరు 31కి గడువు ముగిసిందని, దీంతో మరో వారం పొడిగించామని తెలిపారు. 7వ తేదీ తరువాత అభ్యంతరాలను పరిశీలిస్తామని తెలిపారు.

ఓ పాఠశాల వ్యథ !

- వేధిస్తున్న తరగతి గదుల కొరత
- మరుగుదొడ్లు లేవు.. ఆటస్థలం లేదు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- ఆగిపోయిన కొత్త పాఠశాల భవన నిర్మాణం
- తాటిచెర్ల జడ్పీ పాఠశాలలో సమస్యల తిష్ట


అర్ధంతరంగా ఆగిపోయిన పాఠశాల భవన నిర్మాణం

అనంతపురంరూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిచెర్ల ప్రభుత్వ పాఠశాల స్థాయి పెరిగిందే తప్ప వసతులు ఏమాత్రం మెరుగుపడలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రాథమిక పాఠశాలగా ప్రారంభమై యూపీ, జిల్లా పరిషత్ పాఠశాలగా రూపాంతరం చెందింది. అయితే అందుకు అనుగుణంగా వసతులు, సౌకర్యాలు కల్పించలేదు. తరగతులకు అనుగుణంగా గదులు లేకపోవడం ప్రధాన సమస్య. పిల్లలకు బోర్డు మీద పాఠాలు బోధించాలంటే నిత్యం ఓ తరగతి పిల్లలు బయట కూర్చునే దుస్థితి నెలకొంది. ఫలితంగా విద్యార్థులను, ఉపాధ్యాయులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉన్న గదులు సైతం ఇరుకుగా ఉండటంతో మరిన్ని అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇరుకు గదులతో అవస్థలు

స్థానిక పాఠశాలలో ఒకటి నుంచి పదివరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఒకటి రెండు తరగతుల్లో 27మంది పిల్లలున్నారు. మూడు నుంచి పదో తరగతి వరకు 163మంది పిల్లలున్నారు. తరగతులకు అనుగుణంగా గదులు లేకపోవడం సమస్యగా మారింది. పాఠశాల మొత్తంగా ఉన్న గదుల్లో పిల్లలకు తొమ్మిది గదుల్లో పాఠాలు చెబుతుండగా..హెచ్ఎం, ఉపాధ్యాయులకు ఒక గది ఉంది. ఆ గదులు కూడా ఇరుకుగా ఉండటంతో బోధనకు ఇబ్బందులు తలెత్తున్నట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పాలంటే నిత్యం ఏదో ఒక తరగతిని పాఠశాల ఆవరణలో ఉంచాల్సిన పరిస్థితి ఉంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు సౌకర్యంగా తిరిగేందుకు వీలులేని విధంగా తరగతి గదులున్నాయి. తరగతి గదుల్లోకి గాలి, వెలుతురు కూడా వచ్చే పరిస్థితి లేదు. భోజన విరామ సమయంలో విద్యార్థులు కొంత సేపు ఆడుకునేందుకు కూడా పాఠశాలలో మైదానం లేకపోవడం గమనార్హం. జిల్లా పరిషత్ పాఠశాలలో స్త్రీ, పురుష ఉపాధ్యాయులకు వేరు వేరుగా గదులుంటాయి. ఇక్కడ అందరికీ ఒకటే ఉండటం పాఠశాల దుస్థితిని చెబుతోంది. విద్యార్థిని, విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు సైతం లేవు. నాడు-నేడు కింద వచ్చిన విద్యార్థులు కూర్చునే బల్లలు ఓ గదిలో పడేశారు. దీంతో ఓ గది విద్యార్థులకు లేకుండా పోయింది. స్కూల్ ప్రహరీ ఇటీవల కూలిపోయింది.


మూలన పడేసిన బెంచీలు


పడిపోయిన పాఠశాల ప్రహరీ


తరగతి గదుల సమస్యతో పాఠశాల ఆవరణలో ఉన్న విద్యార్థులు

నిలిచిపోయిన పనులు

గ్రామంలో మరో చోట గత ప్రభుత్వ హయంలో నాడు-నేడు కింద జిల్లా పరిషత్ పాఠశాల నిర్మాణం చేపట్టారు. నిర్మాణం చాలా వరకు పూర్తి అయింది. అయితే బిల్లులు మంజూరు కాకపోవడంతో ఏడాదిన్నర కాలంగా పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం మారిన తరువాత పాఠశాల నిర్మాణాలపై పురోగతి ఉండటం లేదు. పాఠశాల నిర్మాణం పూర్తయితే విద్యార్థులు, ఉపాధ్యాయులకు సౌకర్యంగా ఉంటుంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పాఠశాల సమస్యలపై దృష్టి సారిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది.

ఉన్నతాధికారులకు నివేదించాం

పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాం. గ్రామంలోనే జిల్లా పరిషత్ పాఠశాల నిర్మాణం జరుగుతోంది. అది పూర్తయితే చాలా వరకు సమస్యలు తీరుతాయి.

- రాంకుమార్, హెచ్ఎం, జడ్పీహెచ్ఎస్, తాటిచెర్ల


జిల్లా క్రికెట్ సంఘం సభ్యులకు వినతిపత్రం అందజేస్తున్న క్రికెటర్ల తల్లిదండ్రులు

అర్హులకు అవకాశం కల్పించాలి

సెలెక్షన్ కమిటీకి తల్లిదండ్రుల వినతి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అండర్-12 జిల్లా క్రికెట్ జట్టులో అర్హులైన క్రీడాకారులకు అవకాశం కల్పించాలని క్రీడాకారుల తల్లిదండ్రులు కోరారు. అనంత క్రీడాగ్రామంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, ఇన్‌చార్జి కార్యదర్శి భీమలింగారెడ్డిని మంగళవారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. అండర్-12లో జిల్లా జట్టు సెలెక్షన్స్‌లో ప్రతిభ ఉన్న క్రీడాకారులకు అన్యాయం జరిగిందని అన్నారు. ఇప్పటికే పలు మార్లు జిల్లా క్రికెట్ సంఘం, సెలెక్షన్‌కమిటీ దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. సెలెక్షన్ లిస్టులో వయసు మీరినవారు ఉన్నారని, వెంటనే తొలగించి అర్హులకు చోటు కల్పించాలని కోరారు. అర్హులకు న్యాయం చేస్తామని, క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపడుతున్నామని జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు వారికి వివరించారు.

14 వరకు గడువు

అనంతపురం విద్య, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పరీక్షా పే చర్చ-2025కు ఈ నెల 14వ తేదీలోగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ చదివే విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు ఇందులో పాల్గొనవచ్చునని తెలిపారు. ప్రధానమంత్రిని నేరుగా కలుసుకునే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ అభిప్రాయాలను, ప్రశ్నలను http-s://innovatein-dia1.mygov. in/లో రిజిస్ట్రేషన్ చేసుకుని పంపవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు అనంతపురం జిల్లావారు ఎం.లక్ష్మీనారాయణ రెడ్డి సెల్ నంబర్ 8328012659కు, శ్రీసత్యసాయి జిల్లావారు పోలా లక్ష్మీనారాయణ సెల్ నంబర్ 9440944737కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

- మేయర్ వసీంకు కార్పొరేషన్ల డైరెక్టర్ల సవాల్

అనంతపురం అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఏడు నెలల్లో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని పలు కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు నగర మేయర్ వసీంకు సవాల్ విసిరారు. ఈ మేరకు మంగళవారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో పద్మశాలి, రజక, నాయీబ్రాహ్మణ, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వరన్, కడియాల కొండన్న, పీఎల్ఎన్ మూర్తి మీడియాతో మాట్లాడారు. జగన్ తరహాలోనే కళ్లు ఉండి చూడలేని వ్యక్తిగా మేయర్ వసీం తయారయ్యారని మండిపడ్డారు. ఏడు నెలల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాడో మీరొస్తే నేరుగా చూపిస్తామన్నారు. మీరు చేసిన అవినీతిపై ఇప్పటికే కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారన్నారు.

వైసీపీకి బిగ్‌షాక్

టీడీపీలోకి ముగ్గురు జడ్పీటీసీలు, ఎంపీపీ

ఆహ్వానించిన మంత్రి పయ్యావుల కేశవ్


మంత్రి సమక్షంలో టీడీపీలోకి చేరిన జడ్పీటీసీలు, ఎంపీపీ

ఉరవకొండ/బెళుగుప్ప, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వైసీపీకి ఉరవకొండ నియోజకవర్గంలో కోలుకోలేని దెబ్బ పడింది. ముగ్గురు జడ్పీటీసీలు, ఒక ఎంపీపీ సహా పలువురు సీనియర్ నాయకులు మంత్రి పయ్యావుల కేశవ్ సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. వజ్రకరూరు జడ్పీటీసీలు తేజశ్విని, ఆమె భర్త వశికేరి రమేష్, కూడేరు జడ్పీటీసీ అశ్విని, ఆమె భర్త హరీష్, విడపనకల్లు జడ్పీటీసీ హనుమంతు, బెళుగుప్ప ఎంపీపీ పెద్దన్న, వైసీపీ విడపనకల్లు మండల కన్వీనర్ బసన్న ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. కౌకుంట్లలో మంత్రి కేశవ్ వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరుతున్నారని అన్నారు. వైసీపీ దమనకాండతో వారు విసిగిపోయారని అన్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగిన అరాచక పాలన, కూటమి అధికారంలోకి వచ్చాక ఆరు నెలల పాలనను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారని అన్నారు. విజనరీ చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధివైపు దూసుకుపోతోందని అన్నారు. వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం జరిగిందని ఎంపీపీ పెద్దన్న అన్నారు. విశ్వేశ్వరరెడ్డికి ఆరుసార్లు ఎమ్మెల్యేగా టికెట్టు ఇస్తే ఒక్కసారి గెలిచారని, ఆయన వల్ల ప్రజలకు ఎక్కడా మేలు జరగలేదని అన్నారు. రాజకీయాన్ని అడ్డు పెట్టుకుని కేవలం సంపాదన కోసమే పనిచేశారని విమర్శించారు. విశ్వేశ్వరెడ్డి అత్యంత సన్నిహితుడు, ఆయన అధికారాలను అడ్డు పెట్టుకుని, అంగన్‌వాడీ ఉద్యోగులను, చిరుద్యోగులను బదిలీ చేయిస్తానని బెదిరించి, డబ్బులు వసూలు చేశాడని, కోట్లు సంపాదించాడని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, నాయకులు ప్రసాద్, నాగరాజు, మల్లికార్జున, తిప్పయ్య, బ్యాళ్ల ఈశ్వరయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.

వైసీపీకి రాజీనామా

మండల అధ్యక్షుల సంఘం జిల్లా అధ్యక్షుడు, బెళుగుప్ప ఎంపీపీ పెద్దన్న వైసీపీ సభ్యత్వానికి మంగళవారం రాజీనామా చేశారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిపై ఆయన విలేకరుల సమక్షంలో ధ్వజమెత్తారు. ఆయన సొంతూరిలోనే టీడీపీకి మెజారిటీ వచ్చిందని ఎద్దేవా చేశారు. స్వార్థ రాజకీయాల కోసం కుటుంబ సభ్యులతో పాటు పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం చేశారని అన్నారు. ఆయనకు రాజకీయంగా పుట్టగతులు లేకుండా చేస్తామని హెచ్చరించారు. పయ్యావుల సోదరులతో కలిసి టీడీపీ కోసం పనిచేస్తానని అన్నారు.

బేకరీల్లో తనిఖీలు.. కేసులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతల శాఖ అధికారులు ఉమ్మడి జిల్లాలోని బేకరీలు, మిఠాయిల దుకాణాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. అనంతపురం, నార్పల, బత్తలపల్లి, ధర్మవరం, పుట్టపర్తి ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. తూకం తక్కువ ఇస్తున్నందుకు అనంతపురంలో నాలుగు బేకరీలు, బత్తలపల్లిలో 2, ధర్మవరంలో 2 బేకరీలపై కేసులు నమోదు చేశామని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్ తెలిపారు. తినుబండారాల ప్యాకేజీలపై తయారీదారుల చిరునామా, గడువు, ధరలు, వినియోగదారుడు ఫిర్యాదు చేసేందుకు ఉండాల్సిన పేరు, చిరునామా, ఫోన్ నంబరు, ఈమెయిల్ ఐడీ లేకపోవడం, శీతల పానీయాలను అధిక ధరలకు విక్రయించడం తదితర ఉల్లంఘనలపై మొత్తం 14 కేసులు నమోదు చేశామని, ఏడుగురు దుకాణదారులకు రూ.38 వేల జరిమానా విధించామని తెలిపారు. తనిఖీలలో ఆ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ కె.మహమ్మద్ పాల్గొన్నారు.

మాట మీద నిలబడే ప్రభుత్వం మాది

- ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి/రామగిరి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా ఒకటో తేదీ రాకనే ఇంటి ముందుకు వెళ్లి పింఛన్ అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మాట ఇస్తే నిల బడే నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని కొనియాడారు. ఎమ్మెల్యే మంగళవారం చెన్నేకొత్తపల్లి మండలంలోని హరియన్‌చెరువు గ్రామంలో ఇటింటికి వెళ్లి పింఛన్‌లను పంపిణీ చేశారు. అలాగే రామగిరి మండల కేంద్రంలోని వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఆమె పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓశివశంకరప్ప, ఈఓఆర్డీ అశోక్‌నాయక్, టీడీపీ సీకేపల్లి మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, జనసేన మండల కన్వీనర్ ఇటికోటి క్రాంతికుమార్, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర, ప్రధాన కార్యదర్శి ముత్యాలప్ప, రాజు, రైతు సంఘం రామగిరి మండల అధ్యక్షుడు అక్కులప్ప, నాయకులు గొల్ల అక్కులప్ప, గుర్రంశీన, నరసయ్య, క్రాంతి, మనోహర్, అనిల్, సురేశ్, నాగరాజు పాల్గొన్నారు. అలాగే రామగిరిలో పింఛన్ల పంపిణీకి వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే పరిటాల సునీత లబ్ధిదారులతో కలిసి వరి నాట్లు వేశారు.


రామగిరిలో పొలాల వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యేని కలిసిన ఎంపీడీఓ

రామగిరి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ చంద్రమౌళి మంగళవారం ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. మండల పరిధిలోని వెంకటాపురంలో ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఎంపీడీఓగా బాధ్యతల చేపట్టి మూడు రోజులైంది.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

బుక్కరాయసముద్రం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ పేర్కొన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅథులుగా ఎంపీ, ఎమ్మెల్యే హాజరయ్యారు. పంటలకు డ్రోన్ ద్వారా మందుల పిచికారీ గురించి రెడ్డిపల్లి కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ప్రయోగపూర్వకంగా వివరించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి రైతులకు డెమో ద్వారా తెలియజేశారు. జిల్లా వ్యవసాయాధికారి ఉమామాహేశ్వరమ్మ, ఏడీఏ రవి, వెటర్నరీ ఏడీ రత్నకుమార్, ఎంపీపీ సునీత, కన్వీనర్ అశోక్‌కుమార్, జిల్లా టీడీపీ నాయకులు పసుపుల

● ఎంపీ అంబికా, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శ్రీరామరెడ్డి, ఏఓ శ్యాం కుమార్‌రెడ్డి, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ : పేదల జీవితాల్లో వెలుగు చూడాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ అన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలో మంగళవారం నిర్వహిం చిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. టీడీపీ మండల కన్వీనర్ అశోక్, జిల్లా నాయకులు పసుపుల శ్రీరామరెడ్డి, సాకే రామక్రిష్ణ, కేశన్న, పొడరాళ్ల రవీంద్ర, ఓబులపతి తదితర నాయకులు , అధికారులు పాల్గొన్నారు.



ప్రజా స్పందన కరువై పెయిడ్ ఉద్యమాలు

● మాజీ సీఎం జగన్‌పై ఎమ్మెల్యే దగ్గుపాటి ఫైర్


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ, ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలు నిర్ణయాలతో ప్రజలను ఇబ్బంది పెట్టి, ఇప్పుడు ప్రజా స్పందన కరువై పెయిడ్ ఉద్యమాలు చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్‌పై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మండిపడ్డారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ, ఎమ్మెల్యే దగ్గుపాటి మంగళవారం నగరంలోని 41వ డివిజన్‌లోని హైదర్‌వల్లి కాలనీ, ఎల్బీ నగర్‌లో సామాజిక భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే 20వ డివిజన్‌లో పవర్ ఆఫీస్ సమీపంలోని మోమిన్ బజార్, ఖాజా నగర్, అరుణోదయ కాలనీ జెండా కట్ట వద్ద, 42వ డివిజన్‌లో ఆరో రోడ్డు నాగుల కట్ట వద్ద, ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు ఆదేశాల నేపథ్యంలో జిల్లాలో ఒకరోజు ముందుగా మంగళవారం ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ప్రభుత్వం తప్పిదాలతో ప్రజలపై కోట్లలో విద్యుత్ భారం పడిందన్నారు. అయితే వారే ఇప్పుడు విద్యుత్ చార్జీలు పెంచారంటూ పెయిడ్ ఉద్యమాలు చేస్తున్నారని మండిపడ్డారు. నగర పాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్, తహసీల్దార్ హరికుమార్, టీడీపీ నాయకులు గంగారామ్, రాయల్ మురళి, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వరన్, పీఎల్ఎన్ మూర్తి, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, సంగా తేజస్విని, విజయశ్రీరెడ్డి, బల్లా పల్లవి, సరళ, వడ్డే భవానీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరో రోడ్డులోని శ్మశాన వాటికలో కనీస వసతులు కల్పించాలని మాజీ కార్పొరేటర్ సరళ ఎమ్మెల్యేని కోరారు.

అపశ్రుతులు ఉండకూడదు : డీఎస్పీ

అనంతపురం కల్చరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అపశ్రుతులకు తావు ఉండకూడదని డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ఆటోలో నగరమంతా తిరిగేలా చేపట్టిన అవగాహన కార్యక్రమాన్ని డీఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలన్నారు. ర్యాష్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడప డం వల్ల ఇతరులకు ఇబ్బంది కలిగించడం వంటి పనులు చేయవద్దని ఆయన సూచించారు.

మీ అవినీతిని బయట పెడతారని భయం

● వైసీపీ నాయకులపై టీడీపీ మైనార్టీ నాయకుల ఫైర్

అనంతపురం అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మీరు చేసిన అవినీతిని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక్కొక్క టి బయటకు తీస్తారన్న భయంతోనే అబద్ధాలు మాట్లాడుతూ, ప్రజలను మభ్యపెట్టాలని కుట్రలు పన్నుతున్నారని వైసీపీ నాయ కులపై టీడీపీ మైనార్టీ నాయకులు మండిపడ్డారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో మంగళవారం కార్పొరేటర్ బాబాఫక్రుద్దీన్, మైనార్టీ నాయకులు ఫిరోజ్ అహ్మద్, సైఫుద్దీన్, ముక్తియార్, ఇస్మాయిల్,* ఎకిందర్ మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో నిజంగా అభివృద్ధి జరిగి ఉంటే గత కౌన్సిల్ సమావేశంలో మీ పార్టీకి చెందిన కార్పొరేటర్లే తమ డివిజన్లల్లో అభివృద్ధి జరగలేదని ఎందుకు నిలదీశారన్నారు. ఈ విషయం మర్చిపోయారా అని మేయర్‌ను ప్రశ్నించారు. ఎమ్మెల్యే అభివృద్ధి పనులు చేయిస్తుంటే... వాటిని చేయవద్దంటూ కాంట్రాక్టర్లకు చెబుతూ మేయర్ అడ్డుపడుతున్నారని మండిపడ్డారు.

సదరం అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం హయాంలో సదరం సర్టిఫికెట్ల జారీలో అవకతవకలపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని వడ్డెర్ల కార్పొరేషన్ మా జీ చైర్మన్ దేవళ్ల మురళి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, ఆ సంఘం నాయకుడు కోదండరామిరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సదరం సర్టిఫికెట్ల జారీలో అక్ర మాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందన్నారు. కూటమి ప్రభుత్వం వాటిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం

చిలమత్తూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి దర్గా వద్ద నిద్రచేయాలని వచ్చి రోడ్డుప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మంగళవారం జరిగింది. హిందూపురం పట్టణం మేళాపురానికి చెందిన బాబావలి, షాను దంపతులు ద్విచక్రవాహనంలో శెట్టిపల్లి దర్గాకు వచ్చారు. అక్కడ సోమవారం రాత్రి బస చేసి దర్గా వద్ద ప్రార్థనలు చేసుకున్నారు. అనంతరం మంగళవారం ఉదయమే లేచి తమ సొంత గ్రామమైన మేళాపురానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. కొడికొండ చెక్‌పోస్టు కేశవరెడ్డి పెట్రోల్ బంకు వద్దకు రాగానే వెనుకనుంచి వచ్చిన కారు ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి వారి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో ఇద్దరు దంపతులు గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో షాను (60) అక్కడికక్కడే మృతిచెందగా, బాబావలి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఘటన జరిగిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు.

వృద్ధురాలి ఆత్మహత్య

పరిగి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పరిగి చెరువులో పడి కదిరమ్మ (65)అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపిన వివరాల మేరకు ఇప్పటివరకు నాలుగైదుసార్లు ఆమె ఆత్మహత్యకు యత్నించంగా కుటుంబసభ్యులు గమనించి, అడ్డుకున్నారు. మంగళవారం ఉదయం ఎవరూలేని సమయంలో చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి శవాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

'అర్హులకు అవకాశం కల్పించాలి'

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లా అండర్-12 క్రికెట్ జట్టులో అర్హులైన క్రీడాకారులకు అవకాశం కల్పించాలని క్రీడాకారుల తల్లిదండ్రులు కోరారు. అనంత క్రీడాగ్రామంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, ఇంచార్జి కార్యదర్శి పీఎల్ ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డిని క్రీడాకారుల తల్లిదండ్రులు మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు స్పందిస్తూ...కచ్చితంగా అర్హులైన క్రీడాకారులకు న్యాయం చేస్తామని, క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపడుతున్నామని వివరించారు.

ప్రభుత్వ భూమి ఆక్రమించారని ఫిర్యాదు

రాప్తాడు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లలరేవు గ్రామంలో ప్రభుత్వ భూమిని వైసీపీ శ్రేణులు ఆక్రమించారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. మండలంలోని గొందిరెడ్డిపల్లి, పులలరేవు గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పుల్లలరేవులో గ్రామస్థులు రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ శ్రేణులు గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 103లో 14.57 ఎకరాలు ఆక్రమించారని తెలిపారు. అలాగే గొందిరెడ్డిపల్లిలో పలువురు రైతులకు చెందిన దాదాపు 100 ఎకరాల భూమి రైల్వేలైన్ కోసం ఆన్‌లైన్‌లో నమోదైందని ఆ గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో రైల్వే లైన్ లేకపోయినా తమ భూములు రైల్వే భూములుగా నమోదయ్యాయని తెలిపారు.

పింఛన్ల పంపిణీ

గార్లదిన్నె, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా 7701 సామాజిక పింఛన్లు ఉండగా సాయంత్రం వరకు 7468 మందికి పంపిణీ చేశామని ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. దీంతో జిల్లాలో ఆరో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ దామోదరమ్మ, పంచాయతీ కార్యదర్శులు సచి వాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●శింగనమల: మండలంలో మంగళవారం 98 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ నిర్మలకుమారి తెలిపారు. గుమ్మేపల్లిలో సర్పంచ్ డేగల లలితమ్మ, టీడీపీ నాయకులు డేగల కృష్ణమూర్తి, మాసూల చంద్రమోహన్ పాల్గొన్నారు.

●నార్పల: మండలంలోని బొందలవాడ గ్రామంలో కొత్తగా స్పౌస్ పింఛన్‌ను ఉప సర్పంచు ఆలం వెంకట నరసానాయుడు, తహసీల్దార్ అరుణకుమారి మంగళవారం అందజేశారు. బొందలవాడ గ్రామంలో ఓ మహిళకు భర్త చనిపోయిన నెలరోజు ల్లోపే స్పౌస్ పింఛన్ పేరుతో కొత్తగా మంజూరు చేసినట్లు తెలిపారు.

హౌసింగ్ డీఈకి ఘనంగా వీడ్కోలు


ఉద్యోగ విరమణ పొందిన డీఈని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : హౌసింగ్‌లో అనంతపురం అర్బన్ డీఈగా పనిచేస్తున్న మధుసూదన్‌రెడ్డి ఉద్యోగ విరమణ చేయడంతో శాఖ ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. పీడీ శైలజ అధ్యక్షతన మంగళవారం కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు. డీఈ సేవలను పీడీ కొనియాడారు. క్రమశిక్షణ, అంకిత భావం నిజంగా ప్రశంసనీయమన్నారు. ఆయన శేష జీవితం కూడా సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. తర్వాత అధికారులు, సిబ్బంది డీఈ మధుసూదన్‌రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్ ఖాసిం, అసిస్టెంట్ మేనేజర్ అల్తాఫ్, డీఈ లక్ష్మీనారాయణమ్మ, రాప్తాడు డీఈ శ్రీమన్నారాయణ, కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ డీఈ విజయభాస్కర్, ఉరవకొండ డీఈ హనుమప్ప, తాడిపత్రి డీఈ పాషావలి, శింగనమల డీఈ రామూర్తి, గుంతకల్లు డీఈ వెంకటేశ్వర్లు, రాయదుర్గం డీఈ రంగస్వామి, ఏఈలు శివారెడ్డి, భవానీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్‌షిప్ క్రికెట్ సిరీస్ విజేత హైదరాబాద్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్‌షిప్ క్రికెట్ సిరీస్ విజేతగా హైదరాబాద్ జట్టు నిలిచింది. అనంతపురం నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో మంగళవారం ఫ్రెండ్‌షిప్ క్రికెట్ సిరీస్ ఫైనల్ పోటీలు నిర్వహించారు. హట్‌హాక్స్ న్యూజిలాండ్, హైదరాబాద్ వీకే స్పోర్ట్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ జట్టు 25.4 ఓవర్లలో 194 పరు గులకు ఆలౌట్ అయింది. అనంతరం బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు 25.4 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి, 197 పరుగులతో విజయం నమోదు చేసింది. ఆరు వికెట్ల తేడాతో గెలుపొందిన హైదరాబాద్ జట్టు విజేతకాగా, న్యూజిలాండ్ రన్నర్‌గా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఇంగ్లాండ్ టెస్ట్ క్రికెటర్ హసీబ్‌హమీద్, న్యూజి లాండ్ మాజీ క్రికెటర్ బ్రూస్ ఎడ్గర్, న్యూజిలాండ్ హట్‌హాక్స్ జట్టు చైర్మన్ రవి కృష్ణమూర్తి, హైదరాబాద్ మాజీ ప్లేయర్ గౌస్‌బాబా, రంజీ మాజీ క్రీడాకారుడు షాబుద్దీన్, కోచ్‌లు ప్రవీత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ప్రభుత్వం అండ : ఎమ్మెల్యే

శింగనమల, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ అంద జేస్తూ పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. ఆమె మంగళవారం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో శింగనమల నియోజకవర్గంలోని 11 మందికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. రూ.17,61,984 విలువైన చెక్కులను బాధితులకు అందించారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన మంత్రి


చిన్నారులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం రూపానాయక్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. పాలు తాగారా.. భోజనం చేశారా.. అంటూ ఆప్యాయంగా పలకరించారు. చిన్నారులకు, గర్భిణీలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి ఆదిశేషనాయుడు, తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఎంపీడీవో రవిప్రసాద్, టీడీపీ మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు పాల్గొన్నారు.

కంది పంటను పరిశీలించిన మంత్రి

వజ్రకరూరు మండలంలోని రూపానాయక్ తండా సమీపంలో కంది పంటను మంత్రి పయ్యావుల కేశవ్ పరిశీలించారు. కంది పొలంలో రైతులు ఉండడాన్ని గమనించి అక్కడికి వెళ్లారు. రైతులతో కాసేపు ముచ్చటించారు. ఎన్ని ఎకరాల్లో పంట వేశారు, దిగుబడి ఎంత వచ్చిందని అడిగి తెలుసుకున్నారు.

మంత్రికి వినతుల వెల్లువ

ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్‌కు పలువురు సమస్యలపై విన్నవించారు. కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా విలీనం చేయాలని మంత్రిని కలిసి విన్నవించారు. రూపానాయక్ తండాలో ఇళ్ల స్థలాలు, ఫించన్లు మంజూరు చేయాలని ప్రజలు విన్నవించారు. కౌకుంట్ల గ్రామంలో తెలుగు నాడు ఉపాధ్యాయ క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు.

పేదల ఆనందమే సీఎం లక్ష్యం: విప్


నేమకల్లులో పింఛన్లు పంపిణీ చేస్తున్న కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పేదలు ఆనందంగా జీవించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. మంగవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో ఫించన్లు పంపిణీ చేశారు. గత నెల 30న చంద్రబాబునాయుడు నేమకల్లు గ్రామానికి వచ్చిన సందర్భంగా పింఛన్లకు దరఖాస్తు చేసుకోవడంతో 42 మందికి మంజూరు చేశారు. దీంతో కాలవ శ్రీనివాసులు తుంగభద్ర ప్రాజెక్టు వైస్ చైర్మన్ కేశవరెడ్డి, తహసీల్దార్ మునివేలు, ఈఓపీఆర్డీ దాస్‌తో కలిసి ఇంటింటికి తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ నేమకల్లుకు చంద్రబాబు రావడం వల్ల ఈ గ్రామ భవిష్యత్తు పూర్తిగా మారిపోతుందని తెలిపారు. గ్రామానికి బీసీ బాలుర గురుకులు పాఠశాల, రూ. 3.75 కోట్లతో నేమకల్లు అంజనేయస్వామి ఆలయ ఆధునికీకరణ, రూ. 3 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ప్రతి ఇంటిపై సోలార్ ప్యానల్, అర్హులందరికి పక్కా గృహాలు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బలరాంరెడ్డి, హనుమంతరెడ్డి, మల్లికార్జున, మల్లికార్జున, నాగరాజు, వెంకటెశులు, అప్పారావు, మహేంద్ర, అనిల్, మోహన్ పాల్గొన్నారు. లింగదహాళ్ గ్రామానికి చెందిన కావలి మమత అనే మహిళకు రూ. 1.75 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. అనంతరం నేమకల్లు అంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విశేష పూజలు నిర్వహించారు.

అందరూ ఉద్యోగాలు సాధించాలి

రాయదుర్గం : శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరూ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉద్యోగులుగా చూడాలన్నదే తన ఆకాంక్ష అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆకాంక్షించారు. రాయదుర్గంలో గత రెండు నెలలుగా నిర్వహిస్తున్న డీఎస్సీ ఉచిత శిక్షణ మంగళవారం ముగిసింది. వారికి ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తన ఆశలకు అనుగుణంగా విద్యార్థులు రెండునెలలు ప్రతిభ కనబరిచారన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శిక్షకులు వారి వంతు ప్రయత్నం చేశారన్నారు. ఈ కేంద్రాన్ని సక్రమంగా నడపడంలో అయూఫ్, ఇక్బాల్ ఎంతో చొరవ తీసుకొని నిర్వర్తించారన్నారు. మధ్యాహ్న భోజనం అందించడంలో బండి కృష్ణమూర్తి, శివ, శీన, జిలాన్, బసవరాజు, బసప్ప కృషి చేశారన్నారు.

యువకుడి ఆత్మహత్య


నరేష్ (ఫైల్)

కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మారెంపల్లి కాలనీకి చెందిన నరేష్ (25) అనే యువకుడు మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణానికి చెందిన సరోజమ్మ, హుస్సేనప్ప దంపతుల కుమారుడు నరేష్ ఆటోలో గుజిరి వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. తల్లిదండ్రులు బెంగళూరులో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పట్టణంలో వ్యాపారం చేసుకుంటూ ఒక్కడే వుండేవాడు. రోజు వారీగా వ్యాపారానికి వెళ్లి ఇంటికి వచ్చాడు. మంగళవారం మధ్యాహ్నం అయినప్పటికీ బయటికి రాకపోవడంతో చుట్టుపక్కల వారికి అనుమానం వచ్చి తలుపులు పగులగొట్టి చూశారు. అప్పటికే ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతుండడం గమనించారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోండి

డీఎస్పీకి టీడీపీ నేతల ఫిర్యాదు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలాంపల్లిలో టీడీపీ నేతలపై దాడి చేసిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాస్‌తో మంగళవారం టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ మాట్లాడుతూ మండలంలోని చింతలాంపల్లిలో 14 సెంట్ల స్థలాన్ని వైసీపీ వర్గీయులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. ఈ విషయాన్ని నిలదీస్తే వైసీపీ వర్గీయులు టీడీపీ నాయకులపై దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో వైసీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. ఉనికి కోసమే వైసీపీ నేతలు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ధర్నా చేశారని విమర్శించారు. గ్రామాల్లో ఎలాంటిగొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేష్, మస్తానప్ప, రామయ్య, మల్లికార్జున, కదిరప్ప, మస్తాన్‌యాదవ్, హనుమంతు, అంజి, రాము, నందీశ్వర్, ఫజులు పాల్గొన్నారు.


డీఎస్పీతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఉపాధి హామీ శిలాఫలకాల ధ్వంసం


ధ్వంసమైన శిలాఫలకాలు

బ్రహ్మసముద్రం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సూగేపల్లి చన్నమల్లప్ప స్వామి గుడి వద్ద చింత వనంలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి 150 శిలాఫలకాలకు సోమవారం రాత్రి దుండగులు ధ్వంసం చేశారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ వనిత స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐకు ఫిర్యాదు చేశారు. పెయింటింగ్ వేసి పనుల వివరాలను అందులో రాయించి పని ప్రదేశంలో పెట్టడానికి సిద్దం చేసి ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 50 సిమెంట్ నామఫలకాలను పగులగొట్టి ధ్వంసం చేశారని ఆమె తెలిపారు. దుండగులపై పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామశర్మ మృతి


రామశర్మ(ఫైల్)

గుత్తి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కర్నూలు రోడ్డులో నివాసముంటున్న స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామశర్మ(61)సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈయన రాత్రి ఆరోగ్యం బాగలేదని స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈయన మృతి పట్ల జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి శ్రీహరి, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కాశీవిశ్వనాథాచారి, న్యాయవాదులు సంతాపం తెలిపారు. మంగళవారం కోర్టు ప్రాంగణంలో సంతాప సభ నిర్వహించారు. న్యాయవాదులు రామశర్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.





అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

తాడిపత్రి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వైస్‌చైర్మన్ అబ్దుల్‌రహీం అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ సీనియర్ అధికారి ఓబులేసు అజెండాను చదివివినిపించారు. పురపాలక సంఘంలోని పలు అభివృద్ధి పనులకు ఆమోదం పొందారు. వివిధ అంశాలపై బడ్జెట్ ఆమోదించామని వైస్‌చైర్మన్ తెలిపారు.

మున్సిపల్ వైస్‌చైర్మన్ల రాజీనామా

మున్సిపల్ వైస్‌చైర్మన్లు అబ్దుల్‌రహీం, సరస్వతి మంగళవారం కౌన్సిల్‌మీట్ అనంతరం కమిషనర్ శివరామకృష్ణకు రాజీనామా లేఖలను అందించారు. అబ్దుల్‌రహీం 4వవార్డు ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందారు. సరస్వతి 9వవార్డు కౌన్సిలర్‌గా గెలుపొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సభ్యులందరికి అవకాశం ఇవ్వాలని గతంలో చెప్పిన మాట కట్టుబడి కొత్తవారికి అవకాశం ఇచ్చేందుకు తాము స్వచ్ఛందంగా రాజీనామా చేశామని తెలిపారు.

మాట నిలబెట్టుకున్న ఘనత చంద్రబాబుదే

గుత్తి,డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచి లబ్ధిదారులకు ఇంటి వద్ద అందేలా చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుది అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారు. మంగళవారం బీసీ కాలనీలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీలో భర్త చనిపోయిన కొన్ని రోజుల వ్యవధిలోనే భార్యకు పింఛన్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా, నాయకులు ఎంకే చౌదరి, శీనా, రమేష్, వేణుగోపాల్, కల్యాణి, రామకృష్ణ పాల్గొన్నారు.


పింఛన్ ఇస్తున్న వెంకటశివుడుయాదవ్





యువ రైతు నేత్ర దానం

కూడేరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో మృతి చెందిన యువరైతు సందీప్ కళ్లను కుటుంబ సభ్యులు దానం చేశారు. సోమవారం సాయంత్రం తోట లో కొబ్బరి చెట్టు పట్ట కొడుతుండగా విద్యుత్ షాక్ గురై రైతు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు స్వచ్ఛంద సంస్థకు కళ్లను దానం చేశారు.

కందుల కొనుగోలుకు చర్యలు

ఉరవకొండ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వారంలోపు కందుల కొనుగోలు ప్రక్రియను ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'కందిపోతున్న రైతులు' అనే కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో స్పందించి పట్టణంలోని మార్కెట్ యార్డులో రైతులు ఆరబోసుకున్న కందులను పరిశీంచారు. తేమ శాతాన్ని మిషన్ ద్వారా నిర్ధారించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్వింటా రూ.7,550తో కొనుగోలు చేసేందుకు నాఫెడ్ ద్వారా ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. కందులు సాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటి దాకా 776 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



బీజేపీ మండల కమిటీల ఎన్నిక

కూడేరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కూడేరు మండల అధ్యక్షుడిగా ఇప్పేరుకు చెందిన నాగరాజును ఎంపిక చేశారు. మంగళవారం కూడేరులో బీజేపీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ ఆధ్యక్షత జరిగిన సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి కమిటీ పనిచేయాలని నాయకులు తెలిపారు.

గుంతకల్లుటౌన్ : బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా వడ్డె రమేష్ నియమితులయ్యారు. స్థానిక ఇల్లూరు గోపాలకృష్ణభవనంలో మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడిగా వడ్డె రమేష్‌ను నియమించారు. పాతగుంతకల్లు అధ్యక్షుడిగా పట్నం రామాంజనేయులు, మండల అధ్యక్షుడిగా అశోక్‌కుమార్‌ను నియమించారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతన భవనాన్ని ప్రారంభించాలి

తాడిపత్రి, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మించిన పశువుల ఆసుపత్రి భవనానికి మరమ్మతులు చేసి వెంటనే ప్రారంభించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పశువుల ఆసుపత్రిని మంగళవారం పరిశీలించిన అనంతరం పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ మాట్లాడుతూ ప్రతిరోజూ వందలాది మూగజీవాలను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకువస్తుంటారన్నారు. సరైన వసతులు లేక వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని గత టీడీపీ హయాంలో నూతన భవనాన్ని నిర్మించారని కానీ వైద్యులకు అప్పగించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజి, సూరి, నాగేంద్ర, రత్నమయ్య, అబ్రహం పాల్గొన్నారు.





కౌన్సిల్ సమావేశం వాయిదా

గుత్తి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మంగళవారం కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమీషనర్ జబ్బర్‌మీయా ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి కౌన్సిలర్లు ఎవరూ హాజరు కాలేదు. ఆజెండాలో అభివృద్ధి పనులలో నిర్దేశించిన మొత్తం బిల్లు కంటే అదనంగా బిల్లు ప్రవేశపెడుతున్నారని, అధికారులు తమకు విలువ ఇవ్వటం లేదని కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాలేదని సమాచారం.

రైల్వే ఎల్‌సీ గేటును ఢీకొన్న ఆటో

గుంతకల్లుటౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీబీ రోడ్డు వద్ద ధర్మవరం రైల్వే ఎల్‌సీ గేటును మంగళవారం సాయంత్రం ఓ ఆటో ఢీకొంది. రైలు వస్తుందని గేట్‌మేన్ గేట్ వేస్తుండగా ఆటో డ్రైవర్ వేగంతో వచ్చి ఎల్‌సీ గేట్‌ను ఢీకొన్నాడు. దీంతో గేటు విరిగింది. కాసేపు ట్రాఫిక్ సమస్య నెలకొంది. ద్విచక్రవాహనదారులు గుంతబావి రైల్వే మోరీ గుండా వెళ్లారు.

ఏఐవైఎఫ్ కమిటీ ఎన్నిక

గుంతకల్లుటౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీటీ పక్కీరప్ప భవనంలో మంగళవారం ఏఐవైఎఫ్ నూతన కమిటీని ఎన్ను కున్నారు. ముఖ్యఅతిథిగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి హాజరయ్యారు. ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడిగా యశ్వంత్, ఉపాధ్యక్షులుగావెంకి, అవవింద్, ప్రధాన కార్యదర్శిగా ఎన్ వేణుగోపాల్, సహాయ కార్యదర్శులుగా పునీత్‌కుమార్, సాయికుమార్, భార్గవ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

సర్వేయర్‌పై రైతుల ఆగ్రహం

కూడేరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): భూ సర్వేలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన గ్రామ సర్వేయర్ తమకు వద్దని రెవెన్యూ సదస్సుల్లో రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం పి. నారాయణపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తిమ్మాపురం గ్రామ పరిధిలోని ఇష్టారాజ్యంగా సర్వే చేసి తమ మధ్య చిచ్చు పెట్టారని మండిపడ్డారు. తక్షణం గ్రామ సర్వేయర్ చంద్రశేఖర్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.













